క్లుప్తంగా

రాఖీ పండుగకు అక్కను తీసుకొస్తూ..

రోడ్డు ప్రమాదంలో గాయపడిన తమ్ముళ్లు, అక్క

బయ్యారం: హాస్టల్‌లో ఉన్న అక్కతో రాఖీ కట్టించుకుందామని ఇంటికి తీసుకెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో తమ్ముళ్లతోపాటు అక్క తీవ్రంగా గాయపడిన సంఘటన బయ్యారంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ మండలం రేగడితండాకు చెందిన బాణోత్ శంకర్ కుమార్తె భానుప్రియ గార్లలోని కేజీబీవీలో నర్సింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. రాఖీ పండుగ కోసం అక్కను ఇంటికి తీసుకెళ్లేందుకు తమ్ముళ్లు బాలాజీ, తరుణ్ మోటార్‌సైకిల్‌పై గార్ల వచ్చి అక్కను తీసుకొని ఇంటికి వెళ్తున్నారు. ఈక్రమంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి మహబూబాబాద్ నుంచి ఇల్లందు వైపు వెళ్తున్న పెట్రోల్ ట్యాంకర్‌ను ఢీకొని రోడ్డుపై పడిపోయారు. దీంతో తీవ్రంగా గాయపడ్డ తమ్ముళ్లతో పాటు అక్కను చికిత్స నిమిత్తం 108 వాహనంలో మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు.

పాలాభిషేకం



తొర్రూరు: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర తగ్గించడం హర్షనీయమని బీజేపీ మహిళా మోర్చా అర్బన్ అధ్యక్షురాలు పల్లె రజిత అన్నారు. ధర తగ్గింపును హర్షిస్తూ బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీ, సరస్వతి, నాగలక్ష్మీ, కీర్తి, యమున, రజియా, వరలక్ష్మీ, ఉమ, యశోద, మంజుల, రామతారలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం స్లాబ్ నిర్మాణ పనులు ప్రారంభం

కురవి: ఇళ్లు లేని నిరుపేదల కలను డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ నెరవేర్చాడని బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి బజ్జూరి పిచ్చిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వడ్లకొండ వీరమల్లు డబుల్ బెడ్రూం ఇంటి స్లాబ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బజ్జూరి వెంకటరెడ్డి, రామకృష్ణారెడ్డి, శరత్ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

గూడూరు: 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ అశోక్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం క్రమబద్ధమైన ఓటరు విద్య ఎన్నికల విద్య భాగస్వామ్యం (ఎస్‌వీఈఈపీ)పై అవగాహన కల్పించారు. ఓటరు నమోదు, ఓటు హక్కు ప్రాముఖ్యత, పలు అంశాలపై అవగాహన కల్పించారు.

విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ గుర్తింపు లేకుండా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్, ఉమ్మడి వరంగల్ జిల్లాలో శ్రీచైతన్య పాఠశాలలను నిర్వహిస్తున్న యాజమాన్యంపై చట్టపరమైన చర్య తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఆందోళన నిర్వహించిన పీడీఎస్‌యూ నాయకులపై శ్రీచైతన్య యాజమాన్యం, పోలీసులు కుమ్మక్కై అక్రమంగా మోపిన తప్పుడు కేసులను తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, సంతోష్, వినేయ్, సతీష్, అఖీల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల సెక్రెటరీగా ప్రవీణ్‌రెడ్డి

దంతాలపల్లి: మండల వ్యాయామ ఉపాధ్యాయుల తొర్రూరు జోన్ సెక్రెటరీగా వాసిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిని బుధవారం దంతాలపల్లి మండల కేంద్రంలో గల ఉన్నత పాఠశాలలో జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. 2023–24 ఎస్‌జీఎఫ్‌ఐ ఎన్నికల్లో భాగంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. అనంతరం దంతాలపల్లి మండల క్రీడలు, జోనల్ క్రీడల ఎంపికలు నిర్వహించాలని తీర్మానం చేసినట్లు తెలిపారు.

ఆహ్వాన పత్రాల అందజేత

పెద్దవంగర: మండలంలోని వర్మీడి గ్రామంలో సీతారామచంద్ర స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనతోపాటు దేవాలయ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఆహ్వాన కరపత్రాలను నాయకులు ముత్తినేని శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఎం.శ్రీనివాస్ బుధవారం మండలంలోని వడ్డెకొత్తపల్లిలో గ్రామస్తులకు పంపిణీ చేశారు. వచ్చే నెల 1 నుంచి 4 తేదీ వరకు వేడుకలు ఉంటాయని తెలిపారు. నాయకులు రైతుబంధు కోఆర్డినేటర్ తంగెళ్లపల్లి మల్లికార్జున్ చారి, కేషబోయిన కుమారస్వామి, బొల్లు ఉషయ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు

పాఠశాలల్లో బుధవారం రాఖీ పండుగను పురస్కరించుకొని విద్యార్థినులు విద్యార్థులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో విద్యార్థులు మొక్కలకు రాఖీలు కట్టారు. పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. గాదె రుక్మారెడ్డి మెమోరియల్ హైస్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ సతీష్, ఇతర సిబ్బందికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. - సాక్షి నెట్‌వర్క్



కేసముద్రం: శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌లో..



కురవి: మొక్కలకు రాఖీ కడుతున్న విద్యార్థినులు



కురవి: నాగార్జున విద్యాలయంలో..



మహబూబాబాద్ రూరల్: టౌన్ పోలీస్ స్టేషన్‌లో రక్షాబంధన్ వేడుకలు..



మహబూబాబాద్ అర్బన్: అక్షర కాన్సెప్ట్ స్కూల్‌లో వేడుకలు..



పెద్దవంగర: వృక్షానికి రాఖీలు కడుతున్న విద్యార్థినులు



డోర్నకల్: రాఖీలు కొనుగోలు చేస్తున్న విద్యార్థినులు



దంతాలపల్లి: మొక్కకు రాఖీ కడుతున్న విద్యార్థినులు



మహబూబాబాద్ రూరల్: పర్వతగిరి గ్రామంలో..

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ



గార్ల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

గార్ల: పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం అని ఇల్లందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియనాయక్ అన్నారు. బుధవారం గార్ల రైతు వేదిక భవనంలో ప్రభుత్వ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇల్లందు నియోజకవర్గంలో గతంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా పలు అభివృద్ధి పనులు చేపట్టానని పేర్కొన్నారు. గార్లలో ప్రధాన సమస్య అయిన పాకాల ఏటిపై రూ.15 కోట్లతో త్వరలో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులు చేసిన తనను రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మండల ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం బీసీబంధు 50 మందికి, కల్యాణలక్ష్మి 48 మందికి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎంపీపీ ఎం శివాజీనాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, వైస్ ఎంపీపీ కట్టెబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, కోఆప్షన్ ఎండి ఖదీర్, సర్పంచ్‌లు అజ్మీర బన్సీలాల్, ధరావత్ సక్రు, బి మోతీలాల్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లింగాల ఉమేష్, రైతుబంధు మండల కన్వీనర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

మండలంలో ప్రభుత్వ పథకాలు కేవలం అధికార పార్టీకి చెందిన వారికే కాకుండా పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందజేయాలని కోరుతూ సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు, ఎన్‌డి మండల కార్యదర్శి సక్రు ఎమ్మెల్యే హరిప్రియకు వినతిపత్రం అందజేశారు.

బీఆర్‌ఎస్ పాలనలో అన్నివర్గాల సంక్షేమం

బయ్యారం: బీఆర్‌ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని ఇల్లందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. కులవృత్తులపై ఆధారపడిన 50 మంది బీసీలకు, కల్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన 41, మైనార్టీ సంక్షేమం కింద మంజూరైన 2 చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గణేష్, సర్పంచ్‌లు కోటమ్మ, మమత, జగన్, వెంకన్న, ఎంపీటీసీలు శైలజ, భద్రయ్య, ఉపేంద్ర, సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజలందరూ నా కుటుంబ సభ్యులే..

● నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి



తొర్రూరు: కాంగ్రెస్‌లో చేరిన వారితో ఝాన్సీరెడ్డి

పెద్దవంగర: పాలకుర్తి నియోజకవర్గ ప్రజలందరూ నాకుటుంబ సభ్యులేనని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పలువురు బుధవారం మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ ఆధ్వర్యంలో చేరారు. ఝాన్సీరెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భాస్కర్, వెంకన్న, నర్సయ్య, అశోక్, కార్తిక్, శ్రీకాంత్, హరీశ్, మల్లేష్, తదితరులు పార్టీలో చేరారు.

స్థానికులను ఆదరించాలి

తొర్రూరు: పాలకుర్తి నియోజకవర్గంలో స్థానికులను ప్రజలు ఆదరించాలని ఎన్నారై, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కోరారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మండలంలోని చెర్లపాలెం ఉప సర్పంచ్ ధర్మారపు శ్రీనివాస్, వార్డు సభ్యులు పులుగుజ్జ శారద, చిట్టిమల్ల మంజులలు బుధవారం డివిజన్ కేంద్రంలో ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మైనారిటీ సెల్ జిల్లా కార్యదర్శిగా ఎండీ అమీజ్, పట్టణ అధ్యక్షుడిగా అహ్మద్‌లు నియామకం అయ్యారు. వారికి ఝాన్సీరెడ్డి నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, నాయకులు రాంచందర్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 16 నుంచి ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడలు



మహబూబాబాద్ రూరల్: మోహన్‌ను సన్మానిస్తున్న పీఈటీలు, ఉపాధ్యాయులు



కేసముద్రం: మాట్లాడుతున్న రామయ్య

కేసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీఎస్‌ఎస్‌లో సెప్టెంబర్ 16నుంచి మండల స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ(అండర్–14, 17 బాల, బాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో) క్రీడలు ప్రారంభించనున్నట్లు కేసముద్రం జోన్ సెక్రటరీ పీఈటీ రామయ్య తెలిపారు. బుధవారం కేసముద్రంస్టేషన్ జెడ్పీఎస్‌ఎస్‌లో కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు మండలాల జోనల్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడల్లో ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 22, 23వ తేదీల్లో నిర్వహించే కేసముద్రం జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీఈటీలు కొమ్ము రాజేందర్, శ్రీను, శంకర్, బిక్షపతి, కిషన్, జ్యోతి, నసీరుద్దీన్, మధుకర్, లలిత పాల్గొన్నారు.

క్రీడలను విజయవంతం చేయాలి

మహబూబాబాద్ రూరల్: సెప్టెంబర్ నెలలో జరుగనున్న ఎస్‌జీఎఫ్ జోనల్ క్రీడలను విజయవంతం చేయాలని స్కూల్ గేమ్స్ జోనల్ సెక్రెటరీ, రెడ్యాల ఆశ్రమ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ధరావత్ మోహన్ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జోనల్ స్థాయి క్రీడల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అంశాల్లో జరిగే ఈ క్రీడల్లో అండర్–14, అండర్–16 విభాగాల్లో 12 జట్ల బాలబాలికలు పాల్గొంటారన్నారు. ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రెటరీగా ఎన్నికైన మోహన్ నాయక్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.వెంకటరెడ్డి అధ్యక్షతన పీఈటీ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ చాంప్లానాయక్, కోశాధికారి అవారి శ్రీనివాస్, ఏహెచ్‌ఎస్ స్టాఫ్ సెక్రటరీ వెంకన్న, ఎస్‌జీఎఫ్ ఇన్‌చార్జ్‌లు రాజానాయక్, శ్రీను, కాంతారావు, పుప్పాల సంజీవరావు పాల్గొన్నారు.

ప్రయోగాత్మక బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలి

తొర్రూరు: ప్రయోగాత్మక బోధనకు ప్రాధాన్యమివ్వాలని ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు దిడ్డి అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మోత్కూరి వెంకటేశ్వర్లు అన్నారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్నతి పేరిట కొనసాగుతున్న ఉపాధ్యాయ శిక్షణా శిబిరాన్ని బుధవారం ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ప్రతినిధులు సందర్శించారు. భౌతిక శాస్త్రాన్ని సులువుగా అర్థమయ్యేలా బోధించే మార్గాలు అన్వేషించాలన్నారు. ప్రయోగాలపై విద్యార్థులకు ఆసక్తి పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గుగులోతు రాము, హెచ్‌ఎం బీవీ రావు, ఉపాధ్యాయులు కె. సుధాకరాచారి, చంద్రమౌళి, దామోదర్ పాల్గొన్నారు.

పరామర్శ..

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌కి చెందిన టి.ఉప్పలయ్య అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు బుధవారం మృతుడి కుటుంబాన్ని మహబూబాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత డాక్టర్ మురళీనాయక్ పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశాడు. కార్యక్రమంలో కేసముద్రం పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



మాట్లాడుతున్న యాప సీతయ్య

మహబూబాబాద్ అర్బన్: విద్యా శాఖలో సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు ధర్నా నిర్వహించగా బీజేపీ, కాంగ్రెస్, పీఆర్టీయూ నాయకులు బుధవారం సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా సీతయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్ట్ ఉద్యోగ వ్యవస్థ ఉండదని చెప్పిన సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు, కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇనుగుర్తినుంచి ఖమ్మం వరకు పాదయాత్ర



యువకులను అభినందిస్తున్న కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం నుంచి ఖమ్మం వరకు కాంగ్రెస్ నాయకుడు గుజ్జునూరి వినోద్ ఆధ్వర్యాన పలువురు యువకులు పాదయాత్ర నిర్వహించారు. ఈనెల 28న మొదలైన పాదయాత్ర బుధవారం ఖమ్మంకు చేరుకోగా, పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈసందర్భంగా వారిని పొంగులేటి అభినందించారు. పాదయాత్రగా వచ్చిన వారిలో వినోద్‌తో పాటు దండు అజయ్, నకిరకంటి బాబు, ఇసంపల్లి సంపత్, ఇసంపల్లి గణేష్, తమ్మడపల్లి రాకేష్, దేవులపల్లి ప్రవీణ్, నాగెల్లి సుధీర్ తదితరులు ఉన్నారు.

‘అమలుకాని హామీలు ఇస్తున్న కేసీఆర్’

మహబూబాబాద్ రూరల్: సీఎం కేసీఆర్ అమలుకు సాధ్యంకాని హామీలు ఇస్తున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు భూక్య మురళీనాయక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూ సెంటర్‌లో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ కరపత్రాల ఆవిష్కరించారు. అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి అనంతరం ఆయన మాట్లాడారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు జరిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజనీకాంత్, నాయకులు పోతురాజు రాజు, అంబటి మహేందర్, సురుగు రంగన్న, వెంకన్న, విజయలక్ష్మి, స్వర్ణలత, నీరుటి సురేష్, గార్లపాటి సాయితేజ, చలమల్ల నారాయణ, సలువాది దిలీప్, జమీల్, భాస్కర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

కేసముద్రం: మండల కేంద్రంలోని కిష్టాపురం కాలనికి చెందిన హుస్సేన్ ఇటీవల మృతి చెందాడు. కాగా ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ఆదేశాల మేరకు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అనంతరం క్వింటా బియ్యం, ఆర్థిక సాయాన్ని పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గుగులోతు వీరునాయక్ అందజేశాడు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముత్యాల శివకుమార్, కోఆప్షన్ మెంబర్ నజ్జు, ఆగె వెంకన్న, నర్సింగం వెంకటేశ్వర్లు, తరాల వెంకన్న, బాలునాయక్, ఎండి.రఫీ, రాపోలు శ్రీను, రాజేష్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ సౌకర్యం కల్పించాలి

గార్ల: మండలంలోని గోపాలపురం అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని పిల్లల తల్లితండ్రులు కోరుతున్నారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడం, ఫ్యాన్ తిరగక పోవడంతో పిల్లలు ఉక్కబోతకు తట్టుకోలేక పోతున్నారని వారు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా

డోర్నకల్: మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు జాబితాను అందుబాటులో ఉంచారు. ఫొటోలతో ఓటరు వివరాలు ముద్రించిన ప్రతులను పోలింగ్ కేంద్రాల గోడలకు అతికించారు.

పిల్లర్లు ధ్వంసం చేశాడని ఫిర్యాదు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని కురవి రోడ్డులో నిర్మిస్తున్న ఇంటి నిర్మాణ పిల్లర్లను ఏనుగు మహేందర్ రెడ్డి అనే వ్యక్తి ధ్వంసం చేసి, దాడికి యత్నించారని భూక్య హోంజీ టౌన్ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. సర్వేనంబర్ 307/2 లో సుమారు 400 గజాల ప్లాట్ ఖరీదు చేసుకున్నానని, 1160/10 డాక్యుమెంట్ ఉందని తెలిపాడు. ఆ స్థలంలో తాను నూతనంగా గృహ నిర్మాణం చేస్తుండగా పిల్లర్లను మహేందర్ రెడ్డి విరగగొడుతుండగా అడ్డుకున్నానని, దీంతో ఆయన అన్యాయంగా తనపై దాడికి యత్నించే ప్రయత్నం చేశాడన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

కురవి: మండలంలోని కందికొండ గ్రామానికి చెందిన సీపీఎం కార్యకర్తలు బుధవారం అయ్యగారిపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి బజ్జూరి పిచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు గుగులోత్ రవినాయక్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో కందికొండ బీఆర్‌ఎస్ శాఖ అధ్యక్షుడు కొల్లూరి సురేష్, వడ్లూరి మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నెల్లికుదురు: మండలంలోని తారాసింగ్ బావితండాకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న గుగులోతు శంకర్ నాయక్, రాజన్న నాయక్ తల్లి గుగులోతు మారోణి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం ఎమ్మెల్యే శంకర్ నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించాడు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

బయ్యారం: సీజనల్ వ్యాధులను అరికట్టి ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ పీవైఎల్ ఆధ్వర్యంలో బుధవారం బయ్యారం పీహెచ్‌సీ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం వైద్యాధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తుడుం వీరభద్రం, నాయకులు మహేష్, నర్సయ్య, సతీష్, సత్యం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నాయకుల ముందస్తు అరెస్ట్

గార్ల: బీఎస్పీ ఆధ్వర్యంలో సూర్యాపేటలో నిర్వహించే మహాధర్నాకు వెళ్తున్న మండల బీఎస్పీ నాయకులను బుధవారం ఎస్సై బానోత్ వెంకన్న ముందస్తు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అరెస్టయిన వారిలో బీఎస్పీ మండల అధ్యక్షుడు అజ్మీర వెంకన్న, నాయకులు మల్లేష్‌యాదవ్, వాగ్యా, జీవన్, పాండు, సుధాకర్ ఉన్నారు.

వైద్యశిబిరం

తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామంలో బాల వికాస సంస్థ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీంద్రాచారి, ఎంపీటీసీ మాధవి, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఎస్‌ఎంసీ చైర్మన్, వార్డు సభ్యులు పాల్గొన్నారు..

తండ్రిపై తనయుడి దాడి

మహబూబాబాద్ రూరల్: కుటుంబ కలహాలతో మహబూబాబాద్ మండలంలోని ఇస్లావత్ తండా జీపీ పరిధిలో గల వెంకట్రాంతండాకు చెందిన బానోత్ వెంకన్నపై ఆయన కుమారుడు సుభాష్ దాడిచేసి గాయపరచగా వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని రూరల్ ఎస్సై రాంచరణ్ బుధవారం తెలిపారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి

కురవి: మండల కేంద్రంలోని గిరిజనులకు నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీలో సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నాయకుడు మాలోత్ కిషన్‌నాయక్ అన్నారు. బుధవారం కాలనీలో సమస్యలను పరిశీలించారు. కార్యక్రమంలో సీతారాంనాయక్, దేవానాయక్, రాములమ్మ, విజయ, రమేష్, రాజా పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఇల్లందు బైపాస్ రోడ్డు ఎంఆర్‌ఎఫ్ షోరూంపైన సెప్టెంబర్ 1న గోనిధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు గోనిధి సంస్థ జిల్లా అధ్యక్షుడు బానోత్ సురేష్ బుధవారం తెలిపారు. అభ్యర్థుల అర్హత ఏదైనా డిగ్రీ, పీజీ ఉండాలని, ఆసక్తిగల అభ్యర్థులు ఫోన్ నంబర్లు 8008460991, 8008743724 సంప్రదించాలన్నారు.

మొక్కలు నాటాలి

డోర్నకల్: గ్రామస్తులంతా హరితహారం కార్యక్రమంలో పాల్గొని విరివిగా మొక్కలు నాటాలని అందనాలపాడు సర్పంచ్ ఆంగోత్ మోహన్ కోరారు. సీరోలు మండలం అందనాలపాడు గ్రామంలో బుధవారం సర్పంచ్ ఆంగోత్ మోహన్ ఇంటింటికి తిరిగి మొక్కలను పంపిణీ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

కేసముద్రం: మండల కేంద్రంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మంచాల కుమార్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా వర్దెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా చీపిరి మల్లయ్య, ప్రధాన కార్యదర్శి గొడిశాల అనిల్‌కుమార్, కోశాధికారి మాడల ఉమ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.

సేంద్రియ పద్ధతులతో అధిక దిగుబడులు

గూడూరు: సేంద్రియ వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని లోడీ సంస్థ డైరెక్టర్ ఇన్నారెడ్డి అన్నారు. మండలంలోని కోబల్‌తండాలో బుధవారం సంస్థ ఆధ్వర్యంలో ఉజ్వల ప్రాజెక్టు కారితాస్ ఇండియా సహకారంతో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం 40 మంది రైతులకు పండ్లు, కూరగాయలు, మొక్కలు, విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సురేష్, ప్రతినిధులు పిచ్చిరెడ్డి, మురళి, రైతులు పాల్గొన్నారు.

సీవైఎస్‌ఎస్ మండల కమిటీ ఎన్నిక

కేసముద్రం: సీవైఎస్‌ఎస్ మండల అధ్యక్షుడిగా ఆగె మధు, కార్యదర్శి బానోత్ హరి, మరికొంత మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి విభాగం సీవైఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బ్యాంక్ ఖాతాకు ఆధార్ లింకు చేసుకోవాలి

కేసముద్రం: సీసీఐకి పత్తి విక్రయించే రైతులకు సంబంధించిన బ్యాంకు ఖాతాకు ఆధార్ నెంబర్ లింకు అయ్యేలా ఉండాలని కేసముద్రం మార్కెట్ స్పెషల్ గ్రేడ్ సెక్రెటరీ అమరలింగేశ్వర్‌రావు తెలిపారు. మార్కెటింగ్ శాఖ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీఐకి పత్తిని విక్రయించాల్సిన రైతులు నేరుగా వచ్చి బయోమెట్రిక్ ద్వారా ధృవీకరించుకోవాలన్నారు. అప్పుడే ఆ రైతుకు సంబంధించిన వివరాలు తక్‌పట్టీలో నమోదు అవుతాయన్నారు. పంట నమోదు ప్రక్రియలో భాగంగా పత్తి రైతుల నుంచి ఆధార్ లింకు ఉన్న ఖాతాలను మాత్రమే సేకరించాలని ఆయన వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. ఈ మేరకు రైతులు వర్షాకాలంలో సాగు చేసిన పత్తి వివరాలను ఏఈవో ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ వెంకన్న, ఏఈఓ రాజేందర్ పాల్గొన్నారు.